# ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మరో వరం

**- ఉపాధి హామీ పథకంతో అనుసంధానం**

**- కుటుంబానికి అదనంగా రూ.27 వేల లబ్ధి**

తొలి సమయం కొత్తగూడ 26 మే 2026



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించిందని వరంగల్ డీసీసీ అధ్యక్షులు మహ్మద్ అయూబ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాకుండా, వారికి అదనపు ఆర్థిక భరోసా కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేస్తూ, లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొంటే అన్స్కిల్డ్ కూలీలుగా రోజువారీ సగటు రూ.300 వేతనం చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ విధంగా 90 రోజుల పాటు పని చేసే ఒక్కో కుటుంబానికి సుమారు రూ.27 వేల వరకు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. ఇప్పటికే ప్రభుత్వం ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల నిర్మాణ సహాయం అందిస్తుండగా, ఇప్పుడు ఉపాధి హామీ పథకం ద్వారా మరింత ఆర్థిక లబ్ధి కలగడం పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని అయూబ్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం కావడంతో పాటు, పేదల జీవనోపాధికి కూడా ఇది దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్రంలో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మహ్మద్ అయూబ్ అన్నారు.

# మంత్రి డాక్టర్ సీతక్క ప్రజా దర్బార్‌కు హాజరు మండల అధ్యక్షులు వజ్జ సారయ్య





తొలి సమయం కొత్తగూడ 26 మే 2026

కొత్తగూడ మండలంలో ఈ నెల 27న తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క ఆధ్వర్యంలో నిర్వహించనున్న "ప్రజా దర్బార్" కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని మండల అధ్యక్షులు వజ్జ సారయ్య పిలుపునిచ్చారు. ఉదయం 8 గంటలకు ఓటాయిలో, అనంతరం ఉదయం 10:30 గంటలకు కొత్తగూడ ఎంపీడీవో కార్యాలయం రైతు వేదికలో ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు మంత్రి డాక్టర్ సీతక్క గారితో పాటు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారని చెప్పారు. ఓటాయి, రేనియా తండా, సాదిరెడ్డిపల్లి, కోనాపురం, ఎంచగూడ, జంగవానిగూడెం (రాంపూర్), కొత్తగూడ, గుంజేడు, కొత్తపల్లి, వేలుబెల్లి, చెరువుముందు తండా గ్రామాల ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలతో హాజరుకావాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున సంబంధిత గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల అధ్యక్షులు వజ్జ సారయ్య కోరారు.

# అసైన్డ్ భూముల పేర పట్టా భూముల కబ్జా

**- పోలీస్ ప్రొటెక్షన్ వున్న భూములపై దౌర్జన్యం హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్న అధికారులపై ఆరోపణలా ?**

**- గట్టుమల్ల భూముల వ్యవహారం వెనుక గల్లీ లీడర్ ల సిల్లీ రాజకీయాలు**



తొలిసమయం, కొత్తగూడెం, మే 26 :


1965 నుండి తమ అధీనంలో ఉన్న పట్టా భూములను కొందరు గల్లీ లీడర్లు తమ స్వార్థ రాజకీయాల కోసం అసైన్డ్ భూములుగా పేర్కొంటు ఆ భూమికి సంబంధం లేని సర్వే నంబర్ లను చూపుతూ తమను ఇబ్బంది పెడుతున్నారని లక్ష్మీదేవిపల్లి మండలం చెరుకుమల్లి కృష్ణ, వెంకటనర్సయ్య తమ ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులమైన తమపై దౌర్జన్యం చేస్తు అనేక ఇబ్బందులు పెడుతున్నారని, 1965 సంవత్సరం నుండి 106, 107,108,109, 110, 111, 121, 127, 128 సర్వే నంబర్ పరిధిలలోని తమకు చెందిన భూములను అదే గ్రామానికి పూనెం నాగేశ్వరావు, బత్తుల రామారావు, కెప్పుల రమణా రెడ్డి, భట్టు శ్రీను, సపక వెంకన్న, బండ వెంకన్న, పడిగ సీతమ్మ తదితరులు సర్వే నంబర్ 112, 113, 114, 115, 116 ల లోని అసైన్డ్ భూములు కబ్జా చేసినట్టు ఆరోపిస్తు తప్పుడు ప్రచారం చేయడమే కాక, గిరిజన గిరిజనేతర వివాదాలను తెర మీదకు తెచ్చి మాపై అక్రమ కేసులు పెట్టి మా భూమిలో సాగు చేస్తున్న జామయిల్ చెట్లను సైతం నరికివేశారన్నారు. మొబైల్ కోర్టు, రెవిన్యూ కోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ అధికారులు క్షేత్ర స్థాయిలో చేసిన సమగ్ర సర్వే లలో తమ భూమికి సంబందించిన రికార్డులు స్పష్టంగా ఉండటంతో ఎం చేయాలో అర్థం కాక నిష్పక్షపాతంగా వ్యవహరించిన తహసీల్దార్ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కోర్టు ఉత్తర్వులను పరిగణలోకి తీసుకుని మా భూములకు, మాకు రక్షణ కల్పించాలని వారు జిల్లా కలెక్టర్ ను కోరారు.

**చిల్లర రాజకీయాలు తగవు**

గ్రామాల్లో తగవులుంటే సర్దిచెప్పాల్సిన గల్లీ లీడర్లు కొందరు పెద్ద మనుషుల ముసుగులో చేస్తున్న చిల్లర రాజకీయాల వల్ల గ్రామాల్లో సమస్యలు పెరుగుతున్నాయని, ఇప్పటికైన వాళ్ళ తీరు మార్చుకోకపోతే రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి నేరుగా కలిసి ఈ వయసులో తమను మానసికంగా హింసిస్తు, సమాజంలో చెడుగా చిత్రికరిస్తున్న విషయాన్ని ఫిర్యాదు చేస్తామన్నారు.

# కొత్తగూడ ఆదివాసి బిడ్డకు డాక్టరేట్

**- వ్యవసాయ రంగంలో లక్ష్మీ ప్రసన్న అరుదైన ఘనత**





తొలి సమయం కొత్తగూడ 26 మే 2026

కొత్తగూడ మండలం తాటివారివేంపల్లి గ్రామానికి చెందిన ఆదివాసి యువతి చుంచా లక్ష్మీ ప్రసన్న వ్యవసాయ రంగంలో డాక్టరేట్ సాధించి అరుదైన ఘనతను అందుకుంది. కనీస సౌకర్యాలు కూడా లేని మారుమూల గ్రామంలో జన్మించిన ఆమె, కష్టాలను అధిగమిస్తూ ఉన్నత విద్యలో ప్రతిభ చాటింది. చుంచా లక్ష్మయ్య, పద్మ దంపతుల కుమార్తె అయిన లక్ష్మీ ప్రసన్నను పేదరికం ఎన్నోసార్లు పరీక్షించినా, తల్లిదండ్రుల త్యాగం, ప్రోత్సాహం ఆమెను విజయ శిఖరాలకు చేర్చాయి. బెంగళూరులోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ ()లో "సాయిల్ సైన్స్" విభాగంలో డాక్టరేట్ పూర్తి చేసిన ఆమె, యూనివర్సిటీ 60వ స్నాతకోత్సవంలో కర్ణాటక గవర్నర్ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఒక ఆదివాసి యువతి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం పట్ల స్థానికులు, బంధువులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీ ప్రసన్న విజయం కేవలం ఆమె వ్యక్తిగత సాధన మాత్రమే కాకుండా, పిల్లల చదువుకోసం కష్టపడే తల్లిదండ్రుల త్యాగానికి నిదర్శనంగా నిలిచింది. భవిష్యత్తులో రైతులకు ఉపయోగపడే పరిశోధనలు చేసి వ్యవసాయ రంగ అభివృద్ధికి సేవ చేయాలని లక్ష్మీ ప్రసన్న ఆకాంక్షిస్తున్నట్లు తెలిసింది. గంగారం మండల కేంద్రానికి చెందిన ఆమె భర్త మోల్కం రాకేష్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



# త్యాగధనులు కోరుకున్న రాజ్యం నిర్మిద్దాం



**- టి ఆర్ పి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క**

**- ఘనంగా కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి వర్ధంతి**

తొలి సమయం, మహబూబాబాద్ మే 26

పీడిత ప్రజల విముక్తి కోసం ప్రాణ త్యాగాలు చేసిన త్యాగధనులు కోరుకున్న రాజ్యం నిర్మించడం కోసం పీడిత అణగారిన ప్రజలు ఐక్యంగా పోరాటం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, పటేల్ సుధాకర్ రెడ్డి సహచరి పటేల్ వనజక్క పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కేంద్రం వడ్డేపల్లిలో టి ఆర్ పి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పీపుల్స్ వార్ పార్టీ కేంద్ర కమిటి సభ్యులు కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి 17 వ వర్ధంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పీడిత ప్రజల విముక్తి పోరు బాట పట్టిన వేల మంది ఉద్యమకారులను పాలకులు కాల్చి చంపినారని, ఉన్నత విద్యావంతులైన ఎంతో మంది జీవితాలను త్యాగం చేసి ఉద్యమ బాట పట్టి ప్రజలకు ఎన్నో హక్కులు సాధించిపెట్టారని అలాంటి త్యాగాదనులు కలలుకన్న రాజ్య నిర్మాణం ద్వారానే భారతదేశంలో సమసమాజం ఏర్పడుతుందని అన్నారు. సంపన్న భూస్వామ్య కుటుంబంలో పుట్టిన పటేల్ సుధాకర్ రెడ్డి కుటుంబం నుండే తిరుగుబాటు మొదలు పెట్టీ రాడికల్ విద్యార్థి నాయకులుగా, దళ కమాండర్ గా, దండకారణ్యంలో పని చేసి కేంద్ర కమిటి సభ్యునిగా ఎదిగారని, రాజ్య హింసను, కష్టాలను, కన్నీళ్ళను తట్టుకొని ఉద్యమించిన వీరుణ్ణి 2009 లో బూటకపు ఎన్కౌంటర్ లో చంపేశారని ఆ మహా నాయకుడు కాంక్షించిన రాజ్య నిర్మాణం కోసమే తను టి ఆర్ పి పార్టీలో చేరానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ బూటకపు ప్రజాస్వామ్య పాలనను నిరసించిన పోరాట యోధులు ఎందరో అడవి బాట పట్టి ఉద్యమించారని, రెండు తరాల చురుకైన, అంకితభావం కలిగిన యువతను పాలకులు కాల్చి చంపారని, అలాంటి త్యాగధనుల లక్ష్యం కోసం ఐక్య పోరాటాలు చేయాలను అన్నారు. 80 ఏండ్లుగా దేశాన్ని పాలించిన ఆయా పార్టీలు ప్రజలను అన్ని రకాలుగా దోచుకున్నారని, రాష్ట్రంతో పాటు దేశంలో అణగారిన వర్గాల రాజ్యం నిర్మితం కోసం తీన్మార్ మల్లన్న నాయకత్వంలో నడుస్తున్న టి ఆర్ పి పార్టీకి అండగా నిలవాలని ఆయన అన్నారు. త్యాగధనులు కోరుకున్న రాజ్య నిర్మాణం కోసం తీన్మార్ మల్లన్న చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్ మాట్లాడుతూ కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి తన జీవితాన్ని బహుజనుల విముక్తి కోసం అంకితం చేసిన మహానేతని, బీ.సీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపై జరుగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అన్యాయాలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారని. ఆయన ఆశయాలు కేవలం చరిత్ర పుటల్లోనే మిగలకుండా, వాటిని ప్రజల జీవితాల్లో అమలు చేయడం మా బాధ్యతని అన్నారు. నేడు తెలంగాణలో బహుజన సమాజానికి రాజకీయ అధికారాన్ని అందించాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్న నాయకత్వంలో టి ఆర్ పి ముందుకు సాగుతోందని, అమరవీరుల త్యాగాలకు నిజమైన గౌరవం అంటే బహుజన రాజ్యాధికారాన్ని స్థాపించడమేనని అన్నారు. ప్రతి కుటుంబానికి విద్య, వైద్యం, ఉపాధి, గౌరవం అందే సమాజం కోసం టి ఆర్ పి పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ పి రాష్ట్ర నాయకులు గిరగాని బిక్షపతి, గ్రేటర్ వరంగల్ అధ్యక్షులు మల్లికార్జున శాస్త్రి, న్యాయవాదులు జన్ను పద్మ, కర్రు పావని, శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు చాపర్తి కుమార్ గాద్దే, రాధక్క, శ్యామ్, సరిత, స్వర్ణక్క, అనసూర్య, సద్గుణ, గోవింద్, మాజీ మావోయిస్టు నాయకులు, బీ.సీ సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థి, మహిళా నాయకులు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొని సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు

# వడదెబ్బ బారిన పడి మహిళ మృతి

తొలి సమయం కొత్తగూడ 26 మే 2026



గూడూరు మండలం మచర్ల గ్రామానికి చెందిన చుంచ స్వప్న (40) వడదెబ్బకు గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, స్వప్న రోజువారీ కూలి పనులకు వెళ్లిన సమయంలో తీవ్ర ఎండలు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా అస్వస్థతకు గురైంది. అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించడంతో కుటుంబ సభ్యులు తొలుత స్థానికంగా చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతూ ఆమె కన్ను మూ సింది. స్వప్న మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మండుతున్న ఎండలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, కూలి పనులకు వెళ్లే వారు తగినంత నీరు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# మానవత్వం చాటుకున్న కార్పొరేటర్ కేకే

**అనాథగా మారిన వృద్ధ మహిళకు అన్ని తానై అంత్యక్రియలు**



తొలిసమయం, కొత్తగూడెం, మే 26 :

కొత్తగూడెంలో వృద్ధ మహిళ కన్నం చంద్రమ్మ (70) మృతదేహం గంటల తరబడి పడి ఉన్నా ఎవరూ ముందుకు రాని పరిస్థితిలో 25వ డివిజన్ కార్పొరేటర్ కనుకుంట్ల శ్రీను (కేకే) మానవత్వం చాటుకున్నారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక మృతి చెందిన ఆ మహిళకు కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్నప్పటికీ అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆయన స్వయంగా బాధ్యత తీసుకుని అంత్యక్రియలు నిర్వహించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న కార్పొరేటర్ కేకే పరిస్థితిని పరిశీలించి వెంటనే స్పందించారు. మృతదేహాన్ని తరలించే ఏర్పాట్లు చేయడంతో పాటు అవసరమైన అన్ని కార్యక్రమాలను దగ్గరుండి నిర్వహించారు. అంత్యక్రియలకు కావాల్సిన ఖర్చులను కూడా ఆయనే భరించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. సమాజంలో మానవ సంబంధాలు క్షీణిస్తున్న వేళ కార్పొరేటర్ కేకే చూపిన మానవత్వానికి ప్రజలు అభినందనలు తెలిపారు. "పదవిలో ఉండటం ఒక్కటే కాదు.. కష్టసమయంలో మనిషికి తోడుగా నిలవడం గొప్ప విషయం" అంటూ స్థానికులు ప్రశంసించారు.